

భోగ శ్రీనివాసమూర్తికి సహస్ర కలశాభిషేకం

శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తి, విష్వక్సేనుడిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తి ముందున్న గరుడాళ్వార్ సన్నిధిలో భోగశ్రీనివాసమూర్తిని, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనుడిని ఆశీనులు చేశారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే భిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ఏకాంతంగా ప్రత్యేక సహస్రకలశాభిషేకం నిర్వహించారు. కాగా, పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ 614లో జ్యేష్ఠ మాసంలో 18 అంగుళాల పొడవు కలిగిన వెండి భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని శ్రీవారి ఆలయానికి కానుకగా ఇచ్చారు. విమాన వేంకటేశ్వరుని విగ్రహం కింద భాగంలోని గోడపై ఈ శాసనం కనిపిస్తుంది. ఈ కలశాభిషేకంలో జీయర్ స్వాములు, ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆరుద్ర పురుగులొచ్చాయ్

ఎర్రావారిపాలె మండలంలో దుక్కి చేసిన పొల్లాలోకి ఆరుద్ర పురుగులొచ్చాయ్. అంటే.. ఖరీఫ్ పంటసాగుకు అదును ప్రారంభమైందని ప్రకృతి సూచనగా రైతులు భావిస్తారు. ఏటా జూన్ నెల ప్రారంభం కాగానే ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తాయి. ఆరుద్ర కార్తె ప్రారంభానికి ఈ పురుగులు పొలాల్లో కనపడటం వల్ల ఆరుద్ర పురుగులుగా పిలుస్తారు. ఎర్రగా మెరుస్తూ, పొలాల్లో చకచకా నడుసస్తూ, ముట్టుకొంటే మృదువుగా ఉండే ఈ పురుగులు రైతులకు కనువిందు చేస్తాయి. పొల్లాలో ఆరుద్ర పురుగులు కనపడడం శుభసూచకంగా రైతులు భావిస్తారు. వర్షాలు భాగా కురస్తాయని వీరి నమ్మకం.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

మేలైన మార్పులు.. జాతీయ ప్రమాణాలు

ఇంటర్ విద్యలో సంస్కరణలు



చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఎయిడెడ్ కళాశాల: 1
ప్రభుత్వ కళాశాలలు: 21
ఇతర ప్రభుత్వ యాజమాన్యం: 163
రెండో సంవత్సర విద్యార్థులు: 30,359

- నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునః ప్రారంభం
- ఫస్టియర్ విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

కీలక సంస్కరణలు.. జాతీయ ప్రమాణాలతో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్య మొదలు కానుంది. వైసీపీ హయాంలో బాలికలకు జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ ప్రవేశ పెట్టినా.. విద్యాపరంగా గాలికొదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. విద్యారంగం అభివృద్ధికి వినూత్న మార్పులు తీసుకొచ్చారు. సోమవారం నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

జాతీయ విద్యా విధానం-2020లో భాగంగా 2025-26 విద్యా సంత్సరం నుంచి ఇంటర్ విద్యలో ఎన్‌సీఈఆర్టీ సిలబస్, సీబీఎస్ఈ విధానాలు అమలు చేయనున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచుతూ ఎలక్టివ్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మ్యాథ్స్- ఏ, బీ రెండింటినీ ఒకే సబ్జెక్టుగా.. బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిసి బయాలజీగా రూపొందించారు. పార్టు-1 సబ్జెక్టు కింద ఆంగ్లం మాత్రమే ఉంటుంది. పార్టు-2 కింద జాతీయ భాషలతోపాటు మరికొన్ని సబ్జెక్టులుంటాయి. విద్యార్థి తన అభీష్టం మేరకు ఏదైనా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. పార్టు-2లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. నూతన విధానంలో ఎంపీసీ విద్యార్థి అదనపు సబ్జెక్టుగా బయాలజీని, బైపీసీ వారు గణితాన్ని ఎంచుకోవచ్చు. పార్టు 1,2,3 సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులనే పరిగణిస్తారు. ప్రశ్నపత్రాల్లోనూ మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో 80 మార్కులకు, ఇతర అంశాల్లో వంద మార్కులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ 20 మార్కులు ఉంటాయి.

మారిన క్యాలెండర్ : ఇంటర్ విద్యా క్యాలెండర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి మార్పులు చేశారు. ఇంతకు ముందు పరీక్షలు అయిపోగానే వేసవి సెలవులు ఇచ్చేవారు. ఇప్పుడేమో పరీక్షల తర్వాత ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభించి 23వ తేదీ వరకు సెకండియర్ తరగతులు నిర్వహిస్తారు. ఏప్రిల్ 24 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇచ్చేలా నిర్ణయించారు. అలా.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించిన నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 15 శాతం సిలబస్ పూర్తయింది.

కొత్తగా ఎంబైపీసీ

ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంబైపీసీ గ్రూపు అందుబాటులోకి రానుంది. 6 సబ్జెక్టులతో ఎంబైపీసీ చదవచ్చు. ఇందులో ఇంగ్లిష్ తప్పనిసరి. సెంకడ్ లాగ్వేజీ ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. గణితం, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఎంపీసీ విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ, సంస్కృతం, ఉర్దూ కాకుండా బయాలజీ తీసుకుని ఎంబైపీసీ చదవవచ్చు. బైపీసీ విద్యార్థులు గణితంను తీసుకుని ఎంబైపీసీ గ్రూపు చదవవచ్చు. ఎంబైపీసీ తీసుకున్న విద్యార్థులకు మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది.

పోటీ పరీక్షలకు సన్నద్ధం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అకడమిక్ తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత రెండు గంటలపాటు (సాయంత్రం 5 గంటల వరకు) జేఈఈ, ఎంసెట్, నీట్‌కు శిక్షణ ఇస్తారు. దీనికి ప్రత్యేక మెటీరియల్ సిద్ధం చేశారు. అవసరమైతే ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పించేలా నిర్ణయించారు.

ఇప్పటికే పుస్తకాలూ పంపిణీ

గత వైసీపీ ప్రభుత్వంలో విద్యా సంవత్సరం సగం పూర్తయినా పుస్తకాలు పంపిణీకాని పరిస్థితులు నెలకొన్నాయి.ఈ ప్రభుత్వంలో ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరం ప్రవేశాలు జరుగుతున్నందున తరగతులు ప్రారంభమైన వెంటనే పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పుస్తకాలు ఆయా కళాశాలలకు చేరాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగించనున్నారు.

హైస్కూల్ ప్లస్‌పై మల్లగుల్లాలు

ఇంటర్ విద్యలో ఇన్ని సంస్కరణలు తీసుకొచ్చిన ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ఎలా అభివృద్ధి చేయాలని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించిన గత వైసీపీ ప్రభుత్వం.. అవసరమైన బోధనా సిబ్బంది, వసతులు కల్పించలేదు. దీంతో రాష్ట్రంలో అతితక్కువ ఉత్తీర్ణతా శాతాన్ని నమోదు చేస్తున్న విద్యాసంస్థలుగా ఇవి నిలిచాయి. జిల్లాలో మొత్తం 29 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా ఏకంగా పదింటిలో విద్యార్థులు లేకపోవడం గమనార్హం. ఈ విద్యాసంస్థలనూ గాడినపెట్టి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు మంత్రి లోకేశ్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఐతే కొంతమంది విద్యావేత్తలు హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేయాలని సూచిస్తున్నట్టు సమాచారం.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి



జిల్లాలో ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి జి. రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాలల పునఃప్రారంభం నేపథ్యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన బోధకులున్నారని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా బోధన ఉంటుందన్నారు. ఈ ఏడాది పరీక్షల్లో ప్రభుత్వ విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రైవేటుతో పోలిస్తే మెరుగైన వసతులు, క్రీడా మైదానాలు ఉంటాయన్నారు. ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిన క్రమంలో పెద్దలు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు.



రేషన్ దుకాణాల నుంచే సరుకులు

జిల్లా అంతటా పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులను పూలతో అలంకరించారు. మామిడి మండలూ కట్టారు. పండుగ వాతావరణంలో రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి, చౌకదుకాణాల్లోనే సరుకుల పంపిణీకి ఈనెల నుంచి చర్యలు తీసుకుంది. తొలిరోజు 16 శాతం మంది సరుకులు తీసుకున్నట్లు సమాచారం. పలు రేషన్ షాపుల్లో సర్వర్ సమస్య తలెత్తడంతో సరుకుల పంపిణీలో జాప్యం జరిగింది. గూడూరులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సత్యవేడు నియోజకవర్గంలోని దాసుకుప్పం, రామగిరిలో ఎమ్మెల్యే ఆదిమూలం రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఇక, తిరుపతి నగరం పెద్దకాపులే అవుట్‌లోని షాపు నెంబరు 32, సత్యనారాయణపురంలోని 74, 75 రేషన్ షాపులలో కార్డుదారులకు సరుకులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కార్డుదారులను నానా ఇబ్బందులు పెట్టారని, రేషన్ బండి ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆరణి అన్నారు. ఎండీయూ వాహన వ్యవస్థలో ఎదురైన సమస్యలను ప్రభుత్వం సమీక్షించి.. ప్రజలకు ప్రయోజనం కలిగించేలా రేషన్ షాపుల నుంచే నేరుగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. బయట పనులకు వెళ్లేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కార్డుదారులకు సమస్యలుంటే బోర్డులో రాసిన నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో రామ్మోహన్‌రావు, డీఎస్‌వో శేషాచలం రాజు, డీటీ సురేంద్ర, అర్బన్ తహసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, కార్పొరేటర్లు, కూటమి నేతలు ఎస్కే బాబు, అన్నా అనిత, పులుగోరు మురళి, సింగంశెట్టి సుబ్బరామయ్య, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్‌కుమార్, దూది శివ, బాలాజీ, శ్రీనివాస్, ఆళ్వార్ మురళి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన తూకం పాటించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డు దారులకు కచ్చితమైన తూకంతో నాణ్యమైన సరుకులు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరంలో కార్డుదారులకు డీఎస్వో శేషాచలంరాజుతో కలిసి ఆదివారం ఆయన సరుకులను పంపిణీ చేశారు. 65 సంవత్సరాలు దాటిన వారికి ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులను అందజేశారు. ఏఎస్వో జయరాజ్, తహసీల్దారు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


యోగిమల్లవరం మిట్టవీధిలో వృద్ధులకు సరుకులు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్




బయోమెట్రిక్‌లో వేలి ముద్ర తీసుకుని అభ్యర్థులను అనుమతిస్తున్న సిబ్బంది - పరీక్షా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రశాంతంగా పోలీసు రాత పరీక్షలు

- 5049 మంది హాజరు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో ఆదివారం పోలీసు ఎంపిక రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 5049 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. బయోమెట్రిక్‌లో అభ్యర్థుల వేలి ముద్రలను తీసుకుని.. మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ప్రతి అభ్యర్థి ఎలక్ట్రానిక్ వస్తువులను బయట పెట్టి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ భక్తవత్సలం తదితర అధికారులతో కలిసి ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయం, మహిళా డీగ్రీ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కొందరు అభ్యర్థులతో మాట్లాడి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా

తిరుపతి(జీవకోన), జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై శనివారం అర్ధరాత్రి ఆర్టీవో మురళీమోహన్ పర్యవేక్షణలో అధికారులు కొరడా ఝుళిపించారు. ఫిట్‌నెస్ లోపం, పన్నులు చెల్లించని, ఇతర అనుమతులు లేని కారణంగా 25 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.10లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. ధ్రువపత్రాల్లేని బస్సులను స్వాధీనం చేసుకుని.. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, చంద్రశేఖర్ ఉన్నారు. సూళ్లూరుపేట, గూడూరు ఎంవీఐలు సునీల్‌రెడ్డి, ప్రభాకర్, శాంతి, అనిల్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

శివ..శివా!

- అవినీతి అధికారికి అందలమా?

తిరుపతి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారులో తీవ్ర ఆరోపణలతో సస్పెండైన అధికారులను ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అందలం ఎక్కించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా గత ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలతో రేణిగుంట తహసీల్దార్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం (8-4-2024) సస్పెండైన అధికారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి గత నెల 18న ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండైన ప్రభుత్వ ఉద్యోగికి ఏడాది తర్వాత పోస్టింగ్ ఇవ్వాలన్న నిబంధన ఉంది. ఆమేరకు ఆయన సస్పెన్షన్‌ను రీవోక్ చేస్తూ పోస్టింగ్ ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా కూర్చునేందుకు సదరు అధికారి సర్వం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రజాప్రతినిధుల సిఫారసులతో తిరుపతి అర్బన్ పోస్టింగ్ దాదాపుగా ఖరారైనట్టుగా తెలుస్తోంది. గతంలో రేణిగుంట తహసీల్దారుగా భూముల లావాదేవీల్లో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. శ్రీకాళహస్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి అనుచరుడిగా వ్యవహరించారన్న ముద్రకూడా ఉంది. వైసీపీ పాలనలో చంద్రబాబును రేణిగుంట విమానాశ్రయంలోఓ విమానాశ్రయంలో నిర్బంధించేలా సదరు అధికారి వైసీపీ నేతల ఆదేశాలతో ఉత్తర్వులు ఇచ్చారు. టీడీపీ యువనేత లోకేశ్ యువగళం పాదయాత్రలో సదరు అధికారి అక్రమాలను వివరించగా.. కూటమి ప్రభుత్వం రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఏసీబీ ట్రాప్‌లో దొరికి సస్పెండయ్యారు. రివోక్ అయిన అధికారులను నాన్ ఫోకల్ పోస్టుల్లో ఉంచాల్సింది పోయి, ప్రత్యేకమైన తిరుపతి తహసీల్దారుగా కేటాయిస్తే కూటమి ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కోక తప్పదు.

సెల్ఫీ పిచ్చితో ప్రాణం పైకి..!

రేణిగుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ పిచ్చితో ఓ విద్యార్థి ప్రాణంపైకి తెచ్చుకున్న ఘటన ఆదివారం తిరుపతి జిల్లాలో రేణిగుంట జిల్లా మామండూరులో చోటుచేసుకుంది. ప్రభుత్వ రైల్వే (జీఆర్పీ) ఎస్ఐ రవి తెలిపిన ప్రకారం.. విశాఖకు చెందిన జాన్సన్(19) ఎస్వీయూనివర్శిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులతో లిసి మామండూరు జలపాతానికి ద్విచక్రవాహనాలపై బయలు దేరారు. మామండూరు రైల్వేస్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాలు ఆపారు. అదే సమయంలో రైలు పట్టాలపై ఆగి ఉన్న డీజల్ ట్యాంకుపైకి ఎక్కి సెల్ఫీ దిగేందుకు జాన్సన్ తన సెల్‌ఫోనును పైకి ఎత్తాడు. అదే సమయంలో 25 వేల వాట్స్ విద్యుత్తు తీగ చేతికి తగలడంతో నిప్పంటుకుని ఎగిరి కిందపడ్డాడు. దీన్ని గమనించిన స్టేషన్‌మాస్టర్.. జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జాన్సన్‌ను చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జాన్సన్ కోమాలో ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



మునిరామయ్యకు నగదు అందజేస్తున్న సూర్యబాబునాయుడు

చంద్రగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగాపురానికి చెందిన మునిరామయ్య ఎనిమిదేళ్లుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు డబ్బులేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో తిరుపతి మానవతా సంస్థ సభ్యుడు సూర్యబాబునాయుడు ఆదివారం రూ.9వేలు అందజేశాడు. ఈ కార్యక్రమంలో తిరుపతి మానవతా సంస్థ చైర్మన్ భార్గవ, కార్యదర్శి పద్మనాభం, సభ్యుడు బాబు పాల్గొన్నారు.

నృత్యం అమోఘం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం నృత్య ప్రదర్శన అమోఘంగా సాగింది. తిరుపతికి చెందిన కీర్తి నృత్యాలయానికి చెందిన కీర్తి రాచంరెడ్డి, ప్రాదేశ్వరరెడ్డి, దిషితరెడ్డి, సాయి రూపిక తదితరులు పుష్పాంజలి, మూషిక వాహన, అనందవర్ధన, కాలభైరవాస్థకం, స్వాగతం కృష్ణ వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. ఏవో సుధాకర్ వారిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రామచంద్రాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సీసీ గ్రూప్ కమాండింగ్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే అన్నారు. మండలంలోని సి.రామాపురం గ్రామంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం 11 ఎయిర్ స్క్వాడ్రన్(టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తిరుపతి అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ మదన్‌మోహన్‌కుమార్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్ విజయకుమార్, శశికుమార్, నాగరాజు, ఎన్‌సీసీ క్యాంపస్ కార్యాలయ పర్యవేక్షకులు సురేష్‌కుమార్, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీవారి వద్ద రాజకీయాలు చేయవద్దు

● ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ





బండారు సత్యనారాయణ - కిరణ్‌కుమార్

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి వద్ద రాజకీయాలు చేయవద్దని ప్రతి ఒక్కరిని కోరుతున్నానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తాను ఎన్నోసార్లు శ్రీవారిని దర్శించుకున్నానని, ఎన్నడూ తిరుమలలో రాజకీయాలు మాట్లాడలేదన్నారు. ఎంతో పవిత్రమైన తిరుమలను కలుషితం చేసేలా మాట్లాడటానికి వీల్లేదన్నారు. ఇక, గతంలో ఎన్నడూ లేని విధంగా కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందన్నారు. స్వామి దయతో చంద్రబాబు, లోకేశ్ నేతృత్వంలో మహానాడు విజయవంతమైందన్నారు. కాగా, అంతకుముందు లలిత జ్యూవెలరీ అధినేత కిరణ్‌కుమార్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

చట్ట వ్యతిరేక శక్తులపై గట్టి నిఘా


● రాత్రిపూట తిరిగే వారిపై స్పెషల్ పార్టీ నిఘా

● ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పటిష్టమైన గస్తీతో చట్ట వ్యతిరేక శక్తులపై గట్టి నిఘా పెట్టామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మే నెలకు సంబంధించి క్రైం వివరాలతో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. '43 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. స్పెషల్ పార్టీ పోలీసులతో ముఖ్య పట్టణాల్లో గస్తీ తిరుగుతూ, రాత్రిపూట రోడ్లపై తిరుగుతున్న 1,997 మంది అనుమానితులకు.. 67 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చాం. బహిరంగంగా మద్యం తాగే వారిపై 1,695 కేసులు పెట్టాం. బహిరంగంగా మద్యంతాగే 19 ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేశాం. 279 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు.. 1,477 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసులను పెట్టాం. 15,753 మోటారు వెహికల్ కేసులు నమోదుచేసి జరిమానా విధించాం. 1953 సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాం. డ్రోన్ ద్వారా 68 ఆపరేషన్లు నిర్వహించా. తిరుపతిలోని పార్కుల్లో 13,806 మంది వృద్ధులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాం. 494 హోంస్టేలను తనిఖీ చేశాం. కార్డెన్ సెర్చ్ కార్యక్రమాల్లో సరైన పత్రాల్లేని 105 వాహనాలు సీజ్ చేశాం' అని ఎస్పీ హర్షవర్ధనరాజు వివరించారు.

పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు జయంత్, వినాయక్

రామకుప్పం/పలమనేరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్‌లను ఆదివారం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు తరలించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అటవీ సమీప పొలాలు, జనావాసాలపై గజదాడుల పరంపర కొనసాగుతుండటంతో కుంకీల సహకారంతో అడవి ఏనుగులను అడవులకే పరిమిత చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా పలమనేరులో ఎలిఫెంట్ క్యాంపు ఏర్పాటు చేసింది. ఇటీవల కర్ణాటక రాష్ట్రం నుంచి నాలుగు కుంకీలను ప్రభుత్వం పలమనేరు క్యాంపునకు తీసుకువచ్చింది. వాటికి అదనపు శిక్షణ ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. దీని కోసం ననియాలలో ఇచ్చిన శిక్షణలో ఆరితేరిన కుంకీలు జయంత్, వినాయక్‌లను ఆదివారం పలమనేరుకు తరలించారు. కుంకీలతో పాటు నలుగురు మావటీలు అక్కడి నాలుగు కుంకీలకు మరింత శిక్షణ ఇస్తారని అటవీ అధికారులు తెలిపారు.





పలమనేరులోని ఎలిఫెంట్ క్యాంపు వద్దకొచ్చిన ఏనుగులు

నిధులు నేలపాలు

● దుస్థితిలో తుడా పార్కు ● మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



తిరుపతి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తుడా (తిరుపతి అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో ముస్తాబు చేసిన పార్కు అధ్వాన స్థితికి చేరుకుంది. తిరుమలనగర్ పంచాయతీ పరిధి తుడా ఎంఐజీ వెంచర్‌లో ఎకరా స్థలంలో రెండేళ్ల క్రితం ఉద్యానవనం అభివృద్ధికి అప్పటి పాలకులు సంకల్పించారు. దాదాపు రూ.60లక్షలు కేటాయించి పనులు మొదలుపెట్టారు. చెట్లను తొలగించి స్థలాన్ని శుభ్రపరిచారు. ఏడు అడుగుల ఎత్తుతో చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. దానిపై ఇనుప కంచెను అమర్చి భద్రత కల్పించారు. ప్రత్యేక ద్వారం నుంచి పార్కులోకి వై ఆకారంలో మూడు దారులు ఏర్పాటు చేసి సిమెంట్ రాళ్లను పరిచారు. నలువైపులా రాతిబల్లలు, వ్యాయామం చేసేందుకు నాలుగు పరికరాలు, బోరు మోటారు, విద్యుత్ జంక్షన్ బాక్సులు, విద్యుత్ స్తంభం, దానికి బల్బులు, స్వాగతం పలికేలా ఆకర్షణీయంగా నెమలి బొమ్మను ఏర్పాటు చేశారు. చదును చేయడానికి ఎర్రమట్టిని నిల్వ చేశారు. ఇలా 90శాతం పనులు పూర్తి చేశారు. ప్రహరీ అంచున వాకింగ్ ట్రాక్, స్ప్రింక్లింగ్, పచ్చిక వంటి పనులు చేయాల్సి ఉండగా ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా అటువైపు కన్నెత్తి చూసే అధికారి లేరు. కనీసం ప్రధాన గేటుకు తాళం వేసే దిక్కులేదు. ఇలా నిర్వహణ లోపంతో ఆ ఉద్యానవనం రోజురోజుకూ పాడుపడిపోయి అధ్వాన స్థితికి చేరుకుంది. ప్రస్తుతం దట్టమైన చెట్లపొదలతో అడవిని తలపిస్తోంది. మందుబాబులకు చక్కటి ఆశ్రయంగా మారింది. ఖాళీ మందు బాటిళ్లు, గ్లాసులు, ఎండిన ఆహారం వంటి దృశ్యాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే వ్యాయామ పరికరాలు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు తుప్పుపట్టి పాడైపోయే ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇటీవల తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాలర్స్ దివాకర్‌రెడ్డి అయినా దీనిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.





రాతి బల్లలకు అల్లుకున్న తీగలు - ఖాళీ మద్యం బాటిళ్లు







ఏపుగా పెరుగుతున్న కంపచెట్లు - ఎండు ఆకులు, పొదలతో అధ్వాన స్థితిలో పార్కు - తుప్పుపడుతున్న వ్యాయామ పరికరాలు

రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం







ఐతేపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు - చిన్నగొట్టిగల్లులో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ జనార్దన్‌రాజు - రామచంద్రాపురంలో..

చంద్రగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో 42 రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఐతేపల్లెలో అధికారులు, టీడీపీ నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య మాట్లాడుతూ గతంలో ఉన్న ఎండీయూ వ్యవస్థతో ప్రజలు ఇబ్బంది పడేవారని, అందుకే దాన్ని రద్దు చేసి, మళ్లీ పాత పద్ధతిలోనే రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శేఖర్, టీడీపీ నాయకులు బాలకృష్ణమూర్తి, కోదండరామనాయుడు, లోకాద్రినాయుడు, ఉస్మాన్, విశ్వనాథం, వెంకటముని, మునిచంద్రయాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా బియ్యం పంపిణీ

భాకరాపేట, జూన్1(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ సజావుగా బియ్యం పంపిణీ చేయాలని చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ జనార్దన్ రాజు అన్నారు. ఆదివారం చిన్నగొట్టిగల్లు ఒకటో రేషన్ షాపులో ఆయన బియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జానకిరామ్, వీఆర్వో మస్తాన్‌బాబు, సర్పంచ్ మనోహర, ఎంపీటీసీ విజయశేఖర్ గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, డీలర్ సంజీవయ్య పాల్గొన్నారు.

కార్డుదారుల సౌలభ్యం కోసమే..

రామచంద్రాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డుదారుల సౌలభ్యం కోసమే ప్రభుత్వం నూతన రేషన్ పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని బలిజపల్లె, పీవీపురం గ్రామాల్లో సరుకుల పంపిణీని రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. తహసీల్దారు వెంకటరమణ, సివిల్ సప్లయిస్ డీటీ యుగంధర్, టీడీపీ నాయకులు జనార్దన్ చౌదరి, విజయకుమార్, త్యాగరాజులు, సుగుణమ్మ, భూపతి రెడ్డి, నరసింహారెడ్డి, రాజేష్‌రెడ్డి, మల్లిరెడ్డి, వెంకటరమణారెడ్డి, నాగూర్‌రెడ్డి, వీఆర్వో గుణభూషణ్‌నాయుడు పాల్గొన్నారు.

తిరుచానూరులో..

తిరుచానూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పంచాయతీ యోగిమల్లవరంలోని చౌకదుకాణం వద్ద టీడీపీ నేతలు నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించారు.గత ప్రభుత్వం ఎండీయూ వాహనాల పేరుతో రేషన్ సరిగ్గా అందజేయకుండా పేదలను ఇబ్బంది పెట్టిందని, ఆ పరిస్థితి లేకుండా ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుచానూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మండల మైనార్టీ నాయకులు సల్మాన్‌రాజు, సాయిరాయల్, హరిరామ్‌రెడ్డి, కలీం, వాసు, జీవన్, ఎలిజిబెత్, రేషన్ షాపు డీలర్ జేఎస్ ఆక్సా పాల్గొన్నారు.



యోగిమల్లవరంలో ప్రజలకు రేషన్ సరుకులు అందిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా రావూరి వెంకటస్వామి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రావూరి వెంకటస్వామి

చిత్తూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ రావూరి వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరులోని మురకంబట్టు, గాంధీ సర్కిల్‌తోపాటు పూతలపట్టు, పెనుమూరు మండలాల్లోనూ ఆయన శ్రేయోభిలాషులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్వీఎస్ నగర్‌లోని తన స్వగృహంలో ఎస్వీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం, అభిమానులు, కుటుంబీకుల నడుమ కేక్‌ను రావూరి వెంకటస్వామి కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలు ఆలయాల అర్చకులు, వేదపండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా, చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులతోపాటు ఎస్వీసెట్ ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ రెడ్డి, అధ్యాపకులు రాజారెడ్డి, విజయ్‌కుమార్, అన్బు, అరసు, నౌషద్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా వరదుడి గరుడ సేవ

పోటెత్తిన భక్తులు





గరుడవాహనంపై విహరిస్తున్న ఇంద్రవరదుడిని దర్శించుకుంటున్న భక్తులు

యాదమరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో ఉన్న ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయం, పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. చిత్తూరు, గుడియాత్తం సమీప ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా గరుడపక్షి.. ఆలయంపై ఆకాశంలో చక్కర్లు కొట్టడం చూసి భక్తులు తన్మయత్వం చెందారు. రాత్రి కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం హనుమంత వాహనం, నాచ్చియార్ తిరుక్కోళం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ జరగనుంది.

శ్రీవారి సేవలో జస్టిస్ దుప్పల వెంకటరమణ



తిరుమల, జూన్1(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం ఆయన పదవీ విరమణ చేయబోతున్న సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చారు. ఆదివారం రాత్రి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈమేరకు జస్టిస్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రోడ్డుకు అడ్డంగా కరెంటు స్తంభాలు

● సత్యనారాయణపురం సర్కిల్ విస్తరించినా ఫలితం శూన్యం





రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభాలు

తిరుపతి(జీవకోన), జూన్1(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన సత్యనారాయపురం సర్కిల్‌ను ఇటీవల అభివృద్ధి చేశారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయమూ లేకుండా సర్కిల్‌ను విస్తరించారు. అయితే సర్కిల్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు అలాగే ఉండిపోయాయి. ఇవి రోడ్డుకు మధ్యలో ఉండడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సర్కిల్‌లో ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్ అంతరాయంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.

నటుడు సోనుసూద్‌కు సాదర స్వాగతం

రేణిగుంట, జూన్ 1, (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు సోనుసూద్‌కు అభిమానులు సాదర స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి ఇండిగో విమా నంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.



తిరుపతి

స్నేహ చందనం పుస్తకావిష్కరణ

- నెమిలేటి కిట్టన్న దంపతులకు సన్మానం



స్నేహ చందనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి శిఖామణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న ఉద్యోగ విరమణ సందర్భంగా కంపల్లె రవిచంద్రన్ సంపాదకత్వంలో రూపొందించిన స్నేహ చందనం అభినందన సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఈ పుస్తకాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు కవి శిఖామణి ఆవిష్కరించారు. శిఖామణి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా, సాహిత్య పరిశోధకుడిగా, కవిగా నెమిలేటి కిట్టన్న మంచి కృషి చేశారని అన్నారు. ఈ విషయాలను వ్యాసకర్తలు ఈ సంచికలో ప్రస్తావించారని అన్నారు. తొలి ప్రతిని ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీడీ చంద్రశేఖర్‌కు అందించారు. పుస్తకాన్ని ఆకాశవాణి మాజీ సంచాలకులు మల్లేశ్వరరావు సమీక్షించారు. నడ్డి నారాయణ అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. ఇందులో పాకాల ఎంఈవో బాబ్జీ, ట్రెండ్స్ స్కూల్ హెచ్‌ఎం కేశవులు నాయుడు, టెంకాయల దామోదరం, సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, వాకా ప్రసాద్, మల్లారపు నాగార్జున, పేరూరు బాలసుబ్రమణ్యం, డాక్టర్ వీఆర్ రాసాని, యువశ్రీ మురళి, గోవిందయ్య, యమలా సుదర్శనం, కడివేటి మునిరత్నం తదితరులు నెమిలేటి కిట్టన్న దంపతులను సత్కరించారు.

వంటావార్పుతో నిరసన

న్యాయం చేయాలని వేణుగోపాల్ కాలనీవాసుల డిమాండ్



వంటావార్పు కార్యక్రమంలో బాధితులు

తిరుపతి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తిరుమలనగర్ గ్రామ సచివాలయ పరిధిలోని వేణుగోపాల్ కాలనీలో ఇళ్ల కూల్చివేతకు నిరసనగా బాధితులు ఆదివారం మధ్యాహ్నం మొండిగోడల మధ్య వంటావార్పు నిర్వహించారు. వేణుగోపాల్ కాలనీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాధితులు వంట చేసి, సహపంక్తి భోజనం చేశారు. బాధితులు మాట్లాడుతూ ఇళ్ల కూల్చివేతతో నిరాశ్రయులమయ్యామని, తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాయ మాటలతో తమను మోసం చేశారని వాపోయారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, బుజ్జి, మాధవ్, నిరాశ్రయులు శ్రీరామ్‌నాయక్, సురేష్, రిషి తదితరులు పాల్గొన్నారు.

నీలంకు ఘన నివాళి



నీలం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎస్వీయూలో ఘన నివాళి అర్పించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు ఆదివారం పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. ఎస్వీయూ ఏర్పాటులో నీలం కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. తద్వారా సీమ ప్రాంత ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ తాండవకృష్ణ, మీడియా డీన్ పీసీ వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైకిల్ వాడకంతో ఆరోగ్యం

సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సైకిల్ వాడకంతో ఆరోగ్యం మెరుగవుతుందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ సైకిల్ వినియోగించడం వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. ఫిట్ ఇండియా లక్ష్యం నెరవేరుతుందన్నారు. కనీసం ప్రతి ఆదివారమూ విధిగా సైకిల్ వాడాలని కోరారు. రెండు కిలోమీటర్ల మేర సామూహిక సైకిల్ రైడింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ సేతురాం, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీపై వైసీపీ కుట్రలు చేస్తోంది

- చర్యలు తీసుకోవాలని డీజీపీకి భానుప్రకాష్‌రెడ్డి ఉత్తరం

తిరుపతి(ఉపాధ్యాయనగర్): టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ నాయులు ఒక ప్రణాళిక ప్రకారమే కుట్రలు చేస్తున్నారని టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో ఆ పార్టీ నాయకులు కుట్రలకు తెరలేపారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కొంతకాలం క్రితం టీటీడీ గోశాలలో వందలాది ఆవులు మరణించాయని దుష్ప్రచారం చేశారని, నిన్నగాక మొన్న తిరుమలలో ఓ ముస్లిం వ్యక్తిని నమాజు చేసుకోమని ప్రోత్సహించి, వారే వీడియో తీసి కొండమీద భద్రత లేదంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని వివరించారు. తాజాగా స్వామివారి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులకు అన్నప్రసాదాలు, పాలు ఇవ్వడంలేదని ప్రాపగండా చేశారని పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి, తెరవెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. రాబోయే ధర్మకర్తల మండలి సమావేశంలో ఇలాంటి విషయాలపై చర్చించి నిబంధనల మార్పునకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీపీలకు ఉత్తరం రాసినట్టు వెల్లడించారు.

డీఐఈఓకు అభినందనలు

తిరుపతి(విద్య), జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి జి.రాజశేఖర్‌కు జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలియజేశారు. రాజశేఖర్‌రెడ్డి నూతనంగా డీఐఈఓగా నియమితులైన సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్1 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 95,080

తలనీలాలు సమర్పించినవారు : 39,668

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జీవకోనలో ఆదివారం ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. రామేశ్వరరెడ్డి, మహిత దంపతులు జీవకోనలో కాపురముంటున్నారు. రామేశ్వర రెడ్డి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బు కోసం తరచూ భార్యతో గొడవపడేవాడు. శనివారం అర్ధరాత్రి తాగొచ్చి భార్యతో గొడవపడుతుండగా ఆమె తండ్రి అడ్డుపడ్డాడు. రామేశ్వరరెడ్డిని బయటకు తోసేసి తలుపులు వేసుకున్నారు. తలుపులు తీయమని కోరినా తీయకపోవడంతో ఆవేశానికి గురై బయట ఉన్న రాడ్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కొంతసేపటికి బయటకు వచ్చిన మహిత భర్త మృతి చెంది ఉండడం గమనించి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేశారు.

జేమ్స్‌పై దాడి కేసులో 12మంది అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌ను నిర్బంధించి దాడి చేసిన ఘటనలో 12మంది నిందితులను అరెస్టు చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. జేమ్స్ నెల్లూరు జిల్లా కొడవలూరు రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం వరకు చదివి నిలిచిపోయిన తిరుపతికి చెందిన యశ్వంత్‌కు, జేమ్స్‌కు పాత గొడవలు ఉన్నాయి. గతంలో శ్రీనివాసమంగాపురంలో, కరకంబాడి ఇంజనీరింగ్ కళాశాల వద్ద కొట్టుకున్నారు. ఇది మనసులో పెట్టుకుని యశ్వంత్ 14వ తేదీ అర్ధరాత్రి కరకంబాడి రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న పీజీ హాస్టల్ వద్ద ఉండిన జేమ్స్, అతని స్నేహితుడు గురుసాయిరెడ్డిపై యశ్వంత్ అతని స్నేహితులు కలిసి దాడి చేశారు. కిడ్నాప్ చేసి తిరుచానూరు మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఎలైట్ పార్క్ హోటల్‌లో నిర్బంధించారు. దళిత విద్యార్థి జేమ్స్‌పై మూత్ర విసర్జన చేయడమేగాక గురుసాయిరెడ్డిని వివస్త్రను చేసి తన చెప్పులతో తానే కొట్టుకునే విధంగా చిత్రహింసలు గురిచేశారు. ఈ ఘటనతో యశ్వంత్‌తో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద యశ్వంత్‌కుమార్, డేరంగుల లలిత్ గోపాల్, గుండు సాయికిరణ్‌రెడ్డి, జశ్వంత్‌చెట్టి, హరీష్, వినోద్, కౌశిక్, శ్రీనివాస్ మౌర్య, చరణ్‌సాయిరెడ్డి, అఖిల్, సాయిఅలియాస్ సంతోష్, హరిలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని, రెండు రోజుల్లో వారినీ అరెస్టు చేస్తామని తెలిపారు.

ఘంటసాలకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వేంకటేశ్వరరావుకు ఘన నివాళి అర్పించారు. ప్రతినెలా ఒకటవ తేదీ ఘంటసాల విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి, పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించే కార్యక్రమాన్ని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కళాకారులు సుబ్రమణ్యం, తిరుమలయ్య, కస్పా పద్మనాభన్, వినాయకరెడ్డి, విక్రం, సురేష్, గురుస్వామి పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా ఉన్న గాంధీరోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్డు

'సూర్య'ప్రతాపం

- రారెత్తిన జనం



తలముసుగుతో, గొడుగుతో వెళ్తున్న ప్రజలు

తిరుపతి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రోహిణికార్తె ప్రభావంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం వేళ ఉష్ణతాపాన్ని తట్టుకోలేక నీడకోసం పరుగులు తీస్తున్నారు. గొడుగులు, తలపై గుడ్డలతో బయటకు వెళుతున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు జ్యూస్ షాపులను, కొబ్బరిబొండాం బండ్లను ఆశ్రయించారు. మార్కెట్ నిండా గొడుగులమయమైంది. వీధి వ్యాపారులది అదే పరిస్థితి. బస్టాండు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మిట్టమధ్యాహ్నం పురవీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. వాహనాలు మినహా జనసంచారం కనబడలేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండు, గాంధీరోడ్డులు బోసిపోయాయి. నగర ఉద్యానవనాలు, డివైడర్ల గార్డెన్స్‌లోని చెట్లు వాడిపోయాయి. పక్షులు దాహార్తి తీర్చుకోవడానికి జలధారలు, నీటి నిల్వలను ఆశ్రయించాయి. రోహిణికార్తె ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనుంది. ఎండ తీవ్రత అప్పటివరకు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగా వారం రోజులు ఎండ లేకపోవడంతో కొంతమేరకు ఉపశమనం పొందిన జనం ఆదివారం వచ్చిన ఎండకు అల్లాడిపోయారు.

మేలో 23.77 లక్షల మందికి శ్రీవారి దర్శనం

- హుండీ ద్వారా అందిన కానుకలు రూ.106.83 కోట్లు



తిరుమల, జూన్1(ఆంధ్రజ్యోతి): మే నెలలో 23.77 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ ద్వారా రూ.106.83 కోట్ల కానుకలు అందాయి. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల క్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నెలారంభంలో కొంత భక్తుల రద్దీ సాధారణంగానే కనిపించినా రెండో వారం నుంచీ పెరిగింది. దీంతో పదిరోజులు 80 వేల మందికిపైగా దర్శించుకోగా, 24వ తేదీ 90,211 మంది, 25న 91,538 మంది, 31వ తేదీన 95,080 మంది భక్తులు రికార్డుస్థాయిలో స్వామిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం కూడా మూడురోజులు రూ.4 కోట్లు దాటగా, 26వ తేదీన రూ.5.09 కోట్లు లభించింది. వేసవి నేపథ్యంలో సామాన్యులకు ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో సిఫార్సు వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో భారీ సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకోగలిగారు. మే నెలలో మూడుసార్లు 90 వేలకు పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం వెనుక అధికారులు, సిబ్బంది విశేష కృషి కనిపిస్తోంది. క్యూల నిర్వహణ, వీఐపీ బ్రేక్‌లో శ్రీవాణి దాతలున్నా అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం చేయించడం గమనార్హం. అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశాలతో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, విజిలెన్స్ సిబ్బంది, శ్రీవారి సేవకులు క్యూలైన్ల వద్దే ఉండి పర్యవేక్షించారు. దీంతో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటల ఘటనలు చోటుచేసుకోలేదు. ప్రస్తుతం వేసవి సెలవులు ముగుస్తున్న క్రమంలో రద్దీ ఇంకా పెరిగే అవకాశం ఉందని, అధికారులు సెలవులు తీసుకోకుండా భక్తులకు సేవలందించాలని చైర్మన్, ఈవో ఆదేశాలు జారీ చేశారు.

తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లితే చర్యలు



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి సభ్యులు శాంతారాం,నరేష్‌లు

తిరుపతి(ఆటోనగర్), జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారాం, నరేష్‌లు హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ క్యూలైన్‌లో భక్తులకు వేడిపాలు సరఫరా చేయలేదని వైసీపీ నాయకులు చైర్మన్, ఈవో డౌన్‌డౌన్ అని నినాదాలు చేయడం సరికాదన్నారు. పాలు సరఫరాలో జాప్యం జరిగితే అధికారులను ప్రశ్నించాలే తప్పా ఉద్దేశపూర్వకంగా పాలకమండలిని నిందించడం బాధాకరమన్నారు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో టీటీడీలో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ప్రస్తుతం దానికి ఫుల్‌స్టాప్ పెట్టామని పేర్కొన్నారు. పాలకమండలి చైర్మన్‌పై ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. తిరుమల పవిత్రతకు భగం వాటిల్లే విధంగా సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీస్తే చర్యలు తీసుకోండి

టీటీడీ చైర్మన్‌కు టీడీపీ నేతల వినతి



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మునిక్రిష్ణ, టీడీపీ నేతలు


తిరుపతి, జూన్1(ఆంధ్రజ్యోతి) : తిరుమల పవిత్రతను కుట్రపూరితంగా దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. ఇటీవల తిరుమలలో వైసీపీ నాయకులు శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తుండాన్ని ఖండిస్తూ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు తదితరులు ఆదివారం టీటీడీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుమలలో ప్రతి నిత్యమూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీరిమీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ నాయుడు స్పందిస్తూ ప్రభుత్వంతో చర్చించి కొత్త చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు సుబ్బు యాదవ్, ధనుంజయ్, హేమంత్ కుమార్ ఉన్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, సహస్రనామార్చన, ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, ముఖమండపంలో వేంచేపు, సమర్పణ, ఆస్థానం ఇత్యాది పూజలు చేశారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7.20గంటలకు మిథున లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం లోపల, బయట విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించారు. దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి. రంగవల్లులు, పచ్చతోరణాలు ఏర్పాటు చేశారు.



యాగశాలలో పూజలు



ఆలయ ప్రాంగణంలో దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణలు

గుర్తు తెలియని వ్యక్తి హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు... వీరారెడ్డిపల్లి సమీపంలోని ఓ లేఅవుట్‌కు వెళ్లే దారి వద్ద మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గీతాకుమారి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు గ్రే రంగు లోయరు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై హిందీ భాషలో అశోక్ పేరుతో పచ్చబొట్టు, ఎడమ చేతిపై తేలు బొమ్మ పచ్చబొట్టు ఉంది. 38 ఏళ్ల వయస్సు ఉంటుందని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ముఖంపై పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. డాగ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్యకర్తలే టీడీపీకి పునాది



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల తదితరులు

నాయుడుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి పునాది అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ సభ్యత్వ నమోదు కోటికి పైగా జరిగిందన్నారు. కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడుకు వేలాది మంది కార్యకర్తలు విచ్చేసి తమ అభిమానాన్ని చాటు కున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పసల గంగాప్రసాద్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానాబాల సుబ్బారావు, శేఖర్‌నాయుడు, జక్క రయ్య, జువ్వలపాటి మస్తాన్, బిరదవాడ నారాయణ, రవి, రామచంద్రారెడ్డి, జీవీఆర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్ర కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో అనేక ఒత్తిళ్లతో సతమతమవుతున్న ప్రజలు యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐలు బాబి, సంగమేశ్వరరావు, టీడీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పెసల కిషోర్‌బాబు, న్యాయవాది గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులతో ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని విందూరు ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన హాకీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బాలాజీ, వేణు, కరిముల్లాఖాన్, మురళీ నాయుడు, మునిప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీస్తే చర్యలు తీసుకోండి
టీటీడీ చైర్మన్‌కు టీడీపీ నేతల వినతి



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేతలు

తిరుపతి, జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. ఇటీవల తిరుమలలో వైసీపీ నాయకులు శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తుండాన్ని ఖండిస్తూ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు తదితరులు ఆదివారం టీటీడీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుమలలో ప్రతినిత్యమూ వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీరిమీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ నాయుడు స్పందిస్తూ ప్రభుత్వంతో చర్చించి కొత్త చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని కార్మికుడి మృతి



చిరంజీవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాయుడుపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో లారీ ఢీకొని కార్మికుడు చిరంజీవి(21) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన చిరంజీవి మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా సెజ్ సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్ లారీ అకస్మాత్తుగా మలుపు తిరగడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు చర్యలు



గూడూరులో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ పంపిణీ వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగానే దుకాణాల ద్వారానే సరుకులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని రాణిపేట, కోనేటిమిట్ట ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదలకు బియ్యం సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమంగా అమ్ముకుందన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలోనే దుకాణాల ద్వారా సరుకులు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ అందించడం జరుగుతుందన్నారు.

ఓజిలి: మండలంలోని పున్నేపల్లి రేషన్‌షాపులో టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు బియ్యం పంపిణీ చేశారు. కురుగొండ్ల రేషను షాపులో తహసీల్దారు పద్మావతి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఓజిలి, మానమాల, రాచపాళెం గ్రామాల్లో టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, తెలుగు మహిళ పవిత్రారెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నాయకులు అర్జున్‌రాజు బియ్యం పంపిణీ చేశారు.

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడుచౌక దుకాణంల్లో సివిల్ సప్లై డీటీ గోపీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలసి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. మండల కేంద్రమైన పెళ్లకూరులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్ బియ్యం పంపిణీ చేశారు. రావులపాడులో టీడీపీ నేత కొచ్చర్ల వెంకటరమణ నాయుడు బియ్యం పంపిణీ చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో ఉన్న రేషన్ దుకాణంలో తహసీల్దారు రాజేంద్ర, సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథ్‌రెడ్డి సరుకుల పంపిణీని ప్రారంభించారు.

తడ: మాంబట్టు రేషన్ దుకాణంలో తహసీల్దారు శరత్‌బాబు, గ్రద్దగుంటలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు తేజారెడ్డి, కాదలూరులో టీడీపీ నాయకుడు వేలూరు చంద్రయ్య, కారూరులో టీడీపీ మండల కార్యదర్శి నీలకంఠం రేషన్ పంపిణీ చేశారు.

చిల్లకూరు: మండల కేంద్రంలోని రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి బియ్యం పంపిణీ చేశారు.

డక్కిలి: పలుగోడు గ్రామంలోని రేషన్ షాపులో తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి బియ్యం పంపిణీ చేశారు. రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని తిన్నెలపూడి, చెందోడు, కేశవరం, చిట్టేడు రేషన్ షాపుల్లో తహసీల్దారు జయజయరావు బియ్యం పంపిణీ చేశారు. కోటలోని రేషన్ షాపులో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, షంషుద్దీన్ బియ్యం పంపిణీ చేశారు.

వాకాడు: కొండూరులో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, వాకాడు, నెలిపూడిలో టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, బాలిరెడ్డిపాళెంలో వెంకటరమణారెడ్డి, రావిగుంటపాళెంలో దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, దుగరాజపట్నంలో దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరులో కుంచం దయాకర్ బియ్యం పంపిణీ చేశారు.

వెంకటగిరి టౌన్: మండల పరిధిలోని జంగాలపల్లిలో రేషన్ షాపులో తహసీల్దార్ రాంబాబు బియ్యం పంపిణీ చేశారు.

రేషన్ సరుకుల కోసం పది కిలోమీటర్లు వెళ్లాలా?



నిరసన తెలుపుతున్న కోతలగుంట గ్రామస్థులు

కోతలగుంట గ్రామస్తుల నిరసన

చిట్టమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ షాపుకెళ్లి సరుకులు తెచ్చుకోలేమని కోతలగుంట గ్రామస్తులు ఆదివారం గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఈశ్వరవాక పంచాయతీలో ఉన్న కోతలగుంట నుంచి ఈశ్వరవాక గ్రామంలో రేషను షాపునకు వెళ్లాలంటే రోడ్డు మార్గంలో పది కిలోమీటర్లు ప్రయాణించాలన్నారు. పొలాల మీదుగా వెళ్లాలన్నా రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాలని, రైతులు వరి సాగుకు సిద్ధం చేయడంతో పొలాల మీదుగా వెళ్లలేమన్నారు. కోతలగుంటలో 180 రేషన్ కార్డులున్నాయని, వీరందిరికీ గ్రామంలోనే సరుకులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఐదుగురు హెచ్‌ఎంల నియామకం

కోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి, పెదగోవిందపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కోటలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలురు ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. అలాగే ఊనుగుంటపాళెం, చెందోడు, ఉత్తమ నెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కావడంతో రెండు రోజుల్లో కొత్త హెచ్‌ఎంల నియామకం జరుగుతుందని ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

పోక్సో కేసునమోదు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పూర్తిస్థాయిలో పథకా లను అమలు పరచలేదన్నారు. స్థానిక టవర్ క్లాక్ కేంద్రం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి



సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామితో బీజేపీ నాయకులు

గూడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. ఆదివారం చెన్నూరు గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బీజేపీ కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్ర స్థావరాలపై దాడులు నిర్వహించి మన దేశ శక్తిని ప్రధాని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో గాలి ప్రకాష్ నాయుడు, కరుణాకర్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, భారతి మోహన్, దయాకర్‌రెడ్డి, చంద్రప్ప, రవిచంద్రారెడ్డి, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ష్యార్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.47 కోట్లు లభించింది. శనివారం 95,080 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



యాగశాలలో పూజలు

తిరుపతి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, సహస్రనామార్చన, ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, ముఖమండపంలో వేంచేపు, సమర్పణ, ఆస్థానం ఇత్యాది పూజా కార్యక్రమాలు చేశారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు, అర్చకస్వాములు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7.20గంటలకు మిథున లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం ఉంటాయి.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని వీఎస్‌ఆర్ పాఠశాలలో ఆదివారం స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చదలవాడ హరిప్రసాద్, శీలం కిరణ్ కుమార్, బాలకృష్ణంరాజు, భానుశ్రీ, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, యోగి, ముమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కోట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2001-2002 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలతో అభినందించారు. వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు.

తెలుగుగంగ నీటి విడుదలపై వివాదం

సూళ్లూరుపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ నీటి విడుదలపై వివాదం చోటుచేసుకుంది. కాళంగి నదిలోకి వచ్చిన గంగ నీరు నెర్రికాలువలోకి చేరుతుంది. నెర్రికాలువ గుండా కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక, గోపాల్‌రెడ్డిపాలెం తదితర గ్రామాలకు జాతీయ రహదారి పక్కనే ఎన్‌వీకండ్రిగ సమీపంలో ఉన్న గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే విషయంలో ఆయా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకుల నడుమ వివాదం తలెత్తింది. తమ గ్రామానికే నీరు మొదట రావాలని కోటపోలూరుకు చెందిన గ్రామస్తులు, తొలుత తమకే రావాలని ఆబాక, సామంతమల్లాం రైతులు పోటాపోటీగా గేట్లను మూసివేశారు. దీంతో ఒక వర్గానికి చెందిన వారు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నాయకులు కొందరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఇరువర్గాలను రాజీ కుదిర్చే పనిలో ఉన్నట్లు సమాచారం.

ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా
25 బస్సులపై కేసుల నమోదు
రూ.10 లక్షల అపరాధ రుసుం వసూలు

తిరుపతి(జీవకోన), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. తిరుపతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం ఇతర దూర ప్రాంతాలకు రాకపోకలు సాగతించే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై శనివారం అర్ధరాత్రి జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ పర్యవేక్షణలో అధికారులు దాడులు నిర్వహించారు. ఫిట్‌నెస్ లోపం, పన్నులు చెల్లించని, ఇతర అనుమతులు లేని కారణంగా 25 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.10లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. నేషనల్ పర్మిట్ ఉన్న బస్సులకు ఇరువురు డ్రైవర్లు విధుల్లో ఉండేలా చూశారు. బస్సుల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని బస్సులను స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వారం రోజులుగా ప్రైవేటు ట్రావెల్స్‌పై పలు రకాల కేసులు నమోదు చేయడమే కాకుండా మూడు బస్సులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్టీవో మురళీమోహన్ తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటసుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, చంద్రశేఖర్ ఉన్నారు. సూళ్లూరుపేట, గూడూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సునీల్‌రెడ్డి, ప్రభాకర్, శాంతి, అనిల్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.



దాడులు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారి శ్రీనివాసరావు

మాతమ్మకు పొంగళ్లు



మాతమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

చిల్లకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుధతీయవాడలోని మాతమ్మకు ఆదివారం నెల పొంగళ్లు పెట్టారు. గత నెల 7నుంచి 11వ తేదీ వరకు మాతమ్మ కొలుపు ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం అమ్మవారి ముగ్గు వేశారు. సాయంత్ర ఆలయం వద్ద భక్తులు సామూహికంగా పొంగళ్లు పొంగించి నైవేద్యం నివేదించారు. రాత్రి తప్పెట్లు, తాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

అట్రాసిటీ కేసు విచారణ

వెంకటగిరి టౌన్, జూన్ 1: అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదివారం వెంకటగిరి మండల పరిధిలోని వర్ధనపల్లిని సందర్శించారు. వర్ధనపల్లి గ్రామానికి చెందిన మూకల చెంచయ్యతో బాలాయపల్లి మండలం అక్కంపేట గ్రామానికి కొంతమందితో భూ వివాదం ఉండేది. ఇటీవల అక్కంపేటవాసులు చెంచయ్య భూమిలో శవాన్ని పూడ్చి పెట్టారు. చెంచయ్య ఫిర్యాదు మేరకు అక్కంపేట గ్రామస్తులపై వెంకటగిరి పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీంతో గీతాకుమారి విచారణ చేపట్టారు. ఆమె వెంట ఎస్‌ఐ సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

పాలస్తీనా ముఖ చిత్రం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

వెంకటగిరి టౌన్, జూన్ 1: స్థానిక ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో పాలస్తీనా ముఖ చిత్రం పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య మాట్లాడుతూ 600 రోజులుగా గాజాపై జరుగుతున్న దాడిలో 50మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. గాజాలో ఏం జరుగుతోందో ప్రజలకు తెలియజేయడానికి ఈ పుస్తకాన్ని ప్రచురించామని తెలిపారు. పాలస్తీనా యుద్ధం వెనుక ఆయుధ వ్యాపారం, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అజిత, గౌస్‌భాషా, లక్ష్మీరెడ్డి, పవన్, కృష్ణారెడ్డి, తిరుపాలు, చిన్న ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతకు భగం వాటిల్లితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ సభ్యులు శాంతారాం, నరేష్

తిరుపతి(ఆటోనగర్), జూన్1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ పాలక మండలి సభ్యులు వైద్యం శాంతారాం, నరేష్ హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ క్యూలైన్‌లో భక్తులకు వేడిపాలు సరఫరా చేయలేదని వైసీపీ నాయకులు చైర్మన్, ఈవో డౌన్‌డౌన్ అని నినాదాలు చేయడం సరికాదన్నారు. పాలు సరఫరాలో జాప్యం జరిగితే అధికారులను ప్రశ్నించాలే తప్పా ఉద్దేశపూర్వకంగా పాలకమండలిని నిందించడం బాధాకరమన్నారు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో టీటీడీలో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ప్రస్తుతం దానికి ఫుల్‌స్టాప్ పెట్టామని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతకు భగం వాటిల్లే విధంగా సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జీవకోనలో ఆదివారం ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు వివరాల మేరకు.. రామేశ్వరరెడ్డి, మహిత దంపతులు జీవకోనలో కాపురముంటున్నారు. రామేశ్వర రెడ్డి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిస య్యాడు. డబ్బు కోసం తరచూ భార్యతో గొడవపడేవాడు. శనివారం అర్ధరాత్రి తాగొచ్చి భార్యతో గొడవపడుతుండగా ఆమె తండ్రి అడ్డుప డ్డాడు. రామేశ్వరరెడ్డిని బయటకు తోసేసి తలుపులు వేసుకున్నారు. తలుపులు తీయమని కోరినా తీయకపోవడంతో ఆవేశానికి గురై బయట ఉన్న రాడ్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కొంతసేపటికి బయ టకు వచ్చిన మహిత భర్త మృతి చెంది ఉండడం గమనించి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

తుఫాన్‌సెంటర్‌లో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుఫాన్‌సెంటర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అందులోభాగంగా అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అనేది ఆరా తీశారు. ఇక రికార్డులు సక్రమంగా లేని 9 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గోపి మాట్లాడుతూ... శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలకు సంబంధించి పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు.

తెలుగుగంగ కాలువలో పడి యువకుడి దుర్మరణం



మధు మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలో దిగి ఈతరాక యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపురం గిరిజనకాలనీ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు అందించిన వివరాలు... బెంగళూరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు మధు(24) కేవీబీపురం మండలం అంజూరులోని అక్క రమ్య ఇంటి వచ్చారు. ఆదివారం అంజూరు సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో అక్క కుమారుడు లతీఫ్‌తో కలిసి ఈత కొట్టడానికి వెళ్లారు. మధు కాలువ మధ్యలోకి వెళ్లడంతో నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. లతీఫ్ కేకలు వేసినప్పటికి రక్షించే వారు లేకపోవడంతో లక్ష్మీపురం గిరిజన కాలనీ దగ్గర తేలాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైసీపీ సైకోల దాష్టీకం హేయం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై వైసీపీ సైకోలు దాష్టీకం హేయమని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు విమర్శించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా వైసీపీలో మార్పు రాలేదన్నారు. ఇబ్రహీం పట్టణంలో ఓ మాజీ మంత్రి కుమారుడి వివాహ వేడుకల్లో తమ సైకోతనాన్ని మరోసారి బయటపెట్టారన్నారు. అటుగా సైకిల్‌లో వెళుతున్న బాలుడిని ఆపి ఆ సైకిల్ లాక్కుని వారి వికృతరూపాన్ని ప్రదర్శిస్తూ నేలకేసి కొట్టి కాళ్లతో తన్ని పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు. సైకిల్‌పాడు చేయవద్దని బాలుడు వేడుకుంటున్నా అతని కళ్లముందే సైకిల్‌ను కసిగా తొక్కడం దారుణమన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, మునిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నటుడు సోనుసూద్‌కు సాదర స్వాగతం



రేణిగుంట, జూన్ 1, (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు సోనుసూద్‌కు అభిమానులు సాదర స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మా పోరాటానికి సంఘీభావం తెలపండి

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడిని శ్రీకాళహస్తీశ్వరాలయ ఉచిత సేవకులు కోరారు. ఆదివారం ఆయనకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమకు జీత భత్యాలు ఇవ్వడానికి పాలకమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా జీతాలు ఇచ్చేందుకు దేవదాయశాఖ అనుమతి ఇచ్చిందన్నారు. అయితే ఆర్డర్ కాపీ వచ్చిన తరువాత ఎన్నో సంవత్సరాలుగా ఉచిత సేవలు చేసిన తమ పేర్లను తొలగించి కొత్తవారిని చేర్చారని చెప్పారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఆదేశాలను ఖాతరు చేయడం లేదన్నారు. అశోక్, రంగయ్య, వంశీ, తులసీరామ్, దామోదరం, గోపి, మునిబాబు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు

చేపల కంపు తప్పించండి సారూ...



పీవీరోడ్డులో చేపల విక్రయం

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో చేపల కంపు సమస్యను తప్పించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు కోరారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ప్రజా నర్సింగ్‌హోం ఎదురుగా ఇటీవల చేపల విక్రయాలు జరగడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విక్రయదారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందికరంగా సాగుతున్న చేపల విక్రయాలను ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ బస్టాండు సమీపంలో పీవీరోడ్డు అత్యంత రద్దీగా ఉంటుందన్నారు. నడిరోడ్డుపై చేపల విక్రయాలు సాగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. ఆర్టీసీ బస్టాండు పక్కనే ఉండటంతో వైద్యశాలల కోసం రోగులు పెద్దసంఖ్యలో వస్తుంటారని అలాంటి వారు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. 2017లో ఇదే విధంగా ఇక్కడ చేపల విక్రయాలను స్థానికులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం వైసీపీ పాలన సమయంలో యధాప్రకారం పీవీరోడ్డులో చేపల విక్రయాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

పుత్తూరు వార్తలు

పాదిరేడు చౌకదుకాణంలో సరుకుల పంపిణీ



వడమాలపేట, 1 జూన్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని 35 చౌక ధర దుకాణాల్లో ఆదివారం కార్డుదారులకు బియ్యం అందజేసినట్లు తహసీల్దార్ జరీనా చెప్పారు. పాదిరేడు చౌకదుకాణంలో టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివరాయల్, నాయకులు సురేష్, లక్ష్మీప్రసన్న,హేమావతి, ఆర్‌ఐ జానీబాషా, వీఆర్వోలు సుమన్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవిరాజుకు ఎన్టీఆర్ స్మారక అవార్డు



పుత్తూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్మారక సేవా అవార్డును పుత్తూరుకు చెందిన డాక్టర్ రవిరాజు అందుకున్నారు. శనివారం విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి అవార్డులను ప్రదానం చేశారు. డాక్టర్ రవిరాజు వృత్తి రీత్యా డాక్టర్ అయినా ప్రవృత్తి రీత్యా సామాజిక సేవలు ఉమ్మడి జిల్లాలో గుర్తింపును తీసుకువచ్చాయి. వాటిని గుర్తించిన ఎక్స్‌రే సంస్థ నిర్వాహకులు ఎన్టీఆర్ స్మారక అవార్డును సినీ నటుడు రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అందించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

సౌకర్యవంతంగా రేషన్ సరుకుల పంపిణీ





తొట్టంబేడులో, శ్రీకాళహస్తి పట్టణంలోని 32వ వార్డులో, రామగిరి రేషన్ షాపులో, పాపానాయుడుపేటలో సరుకుల పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇక్కట్లు తప్పించి సౌకర్యవంతంగా ప్రజా సరఫరాను టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించిందని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 32వ వార్డులో చౌకదుకాణంలో సరుకుల పంపిణీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... గతంలో ఎండీయూల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే విధానం ద్వారా అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయన్నారు. ఇకపై చౌక దుకాణాల ద్వారా బియ్యం, చక్కెర, కందిపప్పు పంపిణీ జరుగుతుందన్నారు. 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు దుకాణాలు పని చేస్తాయన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కంఠారమేష్ తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పంపిణీ జరిగింది. మాజీ ఎంపీపీ వెంకటాచలం, కమల్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గాలి మురళినాయుడు ఆధ్వర్యంలో తొట్టం బేడు మండలం గుండేలిగుంట పంచాయతీ విరూపాక్షిపురంలో సరుకులను పంపిణీ చేశారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలం గోవిందవరం, ఏర్పేడు, మన్నసముద్రం, పాపానాయుడుపేట తదితర గ్రామాల్లో ఆదివారం కార్డుదారులకు చౌకదుకాణాల్లో టీడీపీ నాయకులు బియ్యం, సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు ధనంజయలునాయుడు మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా రేషన్ తీసుకోవడానికి కార్డుదారులు పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మోహన్‌రావు, నాగరాజు నాయుడు, పొన్నారావు, సతీష్‌నాయుడు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల ద్వారా నాణ్యమైన నిత్యావసర సరకులను ప్రభుత్వం అందిస్తుందని, అదే సమయంలో ఆ సరకులను ఎవరైనా అక్రమంగా తరలిస్తే పీడీ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం హెచ్చరించారు. ఆదివారం ఉదయం మండలంలోని రామగిరి చౌక ధర దుకాణంలో కార్డుదారులకు సరు కులను పంపిణీ చేశారు. 65ఏళ్ళ పైబడిన వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ సరకులు అందిస్తారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, రవిరెడ్డి, రాజేశ్వరి, గవాస్కర్, గోపాల్‌నాయుడు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ సుధాకర్, ఎస్‌ఐ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. సత్యవేడు నియోజక టవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్‌నాయుడు వేలూరులో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సతీష్‌నాయుడు, తిరుమల రెడ్డి, పద్మనాభరాజు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల్లో సర్వర్లు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా సరుకుల పంపిణీ ప్రారంభమైంది. ఏ చౌక దుకాణంలో అయినా సరుకులు తీసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో ఉదయం పెద్ద ఎత్తున కార్డుదారులు దుకాణాలకు చేరుకున్నారు. మండలంలోని కొన్ని చౌక దుకాణాల్లో సర్వర్లు సమస్య తలెత్తడంతో అరగంట తర్వాత పంపిణీని ప్రారంభించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): సరుకుల విషయంలో కార్డుదారులను ఇబ్బందులు గురి చేయవద్దని తహసీల్దార్ శ్రీదేవి డీలర్లను ఆదేశించారు. మండల కేంద్రంలో రెండు చౌకదుకాణాల్లో ఆదివారం సరుకులను పంపిణీ చేశారు. మండలంలో 1,11,114 కార్డుదారులు ఉన్నారని, ఇందులో 1,192 మంది దివ్యాంగులు, వృద్ధులు అని చెప్పారు. వారికి ఇంటి వద్దే సరుకులు అందజేయాలన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): ఇకపై చౌక దుకాణ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు తెలి పారు. ఆదివారం మండలంలోని కళత్తూరులో చౌకదుకాణం వద్ద కార్డుదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్ల మెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బాబు యాదవ్, జనసేన అధ్యక్షుతు థామస్, గోవర్ధన్, సాధు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పంలో ఆదివారం చౌకదుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆదిమూలం రేషన్ సరుకులను పంపిణీ చేశారు. డీటీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ సురేష్, వీఆర్వో శేఖర్, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సుందరరామిరెడ్డి, బీటీఎస్ రెడ్డి, పరమశివం, లోకయ్యరెడ్డి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ● సత్యవేడులో రేషన్ షాపు నెం.4లో జరిగిన పంపిణీలో నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, శివానందం, హేమభూషణం, అబు సలీం తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెళ్ళూరు, నందనం గ్రామాల్లో నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు పాల్గొని కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌకదుకాణంలో జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ ఆధ్వర్యంలో సరుకులను పంపిణీ చేశారు. బీసీ కాలనీలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.



వెళ్ళూరులో రేషన్ సరుకుల పంపిణీ



కళత్తూరులో, గుత్తివారిపల్లిలో, బీఎన్‌కండ్రిగలో, నారాయణవనంలో సరుకుల పంపిణీలో టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

రోడ్డు బాగు చేయండి



శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్‌డీకే నగర్ నుంచి నాయుడుపేట రహదారికి టింబర్ డిపో ప్రాంతం మీదుగా అనుసంధాన రహదారి ఇది. ఈ మార్గంలో పలు విద్యా, వ్యాపార సంస్థలున్నాయి. అలాగే పెద్దఎత్తున నివాస గృహాలు కూడా ఏర్పడ్డాయి. అయితే ఈ రోడ్డు చినుకు పడితే చెరువును తలపిస్తోంది. గుంతలు తేలి రాకపోకలకు స్థానికులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రోన్‌తో ఆకతాయిల గాలింపు



డ్రోన్‌తో పట్టణంలోని ప్రాంతాలను పరిశీలించిన పోలీసులు

శ్రీకాళహస్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం డ్రోన్ కెమెరాల సాయంతో ఆకతాయిల కోసం గాలింపు చేపట్టారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి పట్టణంలోని పెండ్లిమండపం నుంచి ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా గస్తీ నిర్వహించారు. ముత్యాలమ్మగుడి వీధి, దుర్గమ్మ తిప్ప పరిసరాలు, కొండమిట్ట, చతుర్మాడ వీధుల్లో ఆకతాయిలు, బహిరంగ మద్యం తాగే వారికోసం గాలింపు చేపట్టారు. కెమెరా లను దూరం నుంచి చూసిన పలువురు ఎక్కడికక్కడ పరుగులు తీశారు.

జేమ్స్‌పై దాడి కేసులో 12మంది అరెస్టు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌ను నిర్బంధించి దాడి చేసిన ఘటనలో 12మంది నిందితులను అరెస్టు చేసినట్లు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. జేమ్స్ నెల్లూరు జిల్లా కొడవలూరు రంగంపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం వరకు చదివి నిలిచిపోయిన తిరుపతికి చెందిన యశ్వంత్‌కు, జేమ్స్‌కు పాత గొడవలు ఉన్నాయి. గతంలో శ్రీనివాసమంగాపురంలో, కరకంబాడీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కొట్టుకున్నారు. ఇది మనసులో పెట్టుకుని యశ్వంత్ 14వ తేదీ అర్ధరాత్రి కరకంబాడీ రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న పీజీ హాస్టల్ వద్ద ఉండిన జేమ్స్, అతని స్నేహితుడు గురుసాయిరెడ్డిపై యశ్వంత్ అతని స్నేహితులు కలిసి దాడి చేశారు. కిడ్నాప్ చేసి తిరుచానూరు మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఎలైట్ పార్క్ హోటల్‌లో నిర్బంధించారు. దళిత విద్యార్థి జేమ్స్‌పై మూత్ర విసర్జన చేయడమేగాక గురుసాయిరెడ్డిని వివస్త్రను చేసి తన చెప్పులతో తానే కొట్టుకునే విధంగా చిత్రహింసలు గురి చేశారు. ఈ ఘటనతో యశ్వంత్‌తో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద యశ్వంత్‌కుమార్, డేరంగుల లలిత్ గోపాల్, గుండు సాయికిరణ్‌రెడ్డి, జశ్వంత్‌చెట్టి, హరీష్, వినోద్, కౌశిక్, శ్రీనివాస్ మౌర్య, చరణ్‌సాయిరెడ్డి, అఖిల్, సాయిఅలియాస్ సంతోష్, హరిలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనతో ప్రమేయమున్న మరో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని, రెండు రోజుల్లో వారినీ అరెస్టు చేస్తామని తెలిపారు.

మునీశ్వరాలయ కుంభాభిషేకం

పిచ్చాటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరంలో కొలువై ఉన్న పాల మునీశ్వర స్వామి ఆలయ ప్రథమ కుంభాభిషేకం ఈనెల 2న సోమవారం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఉదయ్‌కృష్ణ తెలిపారు. ఉదయం గణపతి పూజ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం బాల త్రిపుర సుందరి చందన సహస్రనామ పారాయణం జరుగుతుందని తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

సత్యవేడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వరుసకు కోడలి అయిన వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు... మల్లవారిపాళెం ఈస్ట్ పంచాయతీ చెంగంబాకం మాజీ సర్పంచ్ మునిక్రిష్ణయ్య శ్రీసిటీ పరిధిలోని ఓ పరిశ్రమలో పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తున్న వరుసకు కోడలితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

కేవీబీపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం వేమాలపూడి గ్రామంలో పీపుల్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 300మంది వైద్యపరీక్షలు చేయించు కున్నారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణకు జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. పీపుల్ వెల్ఫేర్ ట్రస్టు తరపున పేదలకు వైద్యసేవలు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీనారాయణ, రాజేష్, ఏడుకొండలు, ట్రస్టు సభ్యులు షాకీరాలీ, గుమ్మళ్ల రాజేశ్వరరావు., జీఎంఆర్ సుబ్రహ్మణ్యం, మధు, శేఖర్, పూజ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఊరేగింపు



ఏర్పేడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో మే 30నుంచి ధర్మరాజుస్వామి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులోభాగంగా ఆదివారం ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మునిరంగారెడ్డి, మునిరత్నంరెడ్డి, మంజుల, కృష్ణారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్



శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతిభకు పురస్కారం

శ్రీకాళహస్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి, కవిత కుమార్తె హర్షిణి టెన్త్‌లో 587 మార్కులు సాధించింది. ఈ నేపథ్యంలో నెల్లూరులోని పరమేశ్వరి కల్యాణ మండపంలో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతి, ప్రశంసాపత్రం, గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్‌మెడల్ అందజేశారు. సినీనటుడు బాలాజి, ప్రభాకర్, వి.గురుదశరథన్, శ్రీనివాసులు, బీఆర్‌రాజేంద్ర పాల్గొన్నారు.